క్లుప్తంగా

కీటక జనిత వ్యాధులపై అవగాహన


మోపిడిలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ: మండల పరిధిలోని మోపిడి, చిన్న ముస్టూరు గ్రామాల్లో బుధవారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండీ షఫీ మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమలు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా వృద్ధి చెందుతాయన్నారు. డెంగీ, మలేరియా లక్షణాలు కన్పిస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శేఖర్, సీఓ భగవాన్, ఏఎన్‌ఎం అనూష, హెల్త్ అసిస్టెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

రాయదుర్గంటౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకూ ఓంశాంతి ప్రాంగణంలో ఉచిత రాజయోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సంచాలకులు బీకే యోగీశ్వరి తెలిపారు. 21వ తేదీ శుక్రవారం నుంచి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ యోగా శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యం పొందేందుకు ప్రజలందరూ యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


నేత్రపల్లిలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను లబ్ధిదారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ప్రభావతమ్మ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 సంవత్సరాలు నిండిన చిన్నారులకు సర్టిఫికెట్లను ఇచ్చారు. అలాగే 3 సంవత్సరాలు నిండిన వారికి ప్రీస్కూల్‌కు జాయిన్ చేసుకున్నారు. సూపర్‌వైజర్ అంజినమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, భాగ్యమ్మ, మెహరూన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కూడేరు: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. అనంతపురానికి చెందిన నాగచైతన్య బుధవారం ద్విచక్రవాహనంపై ఉరవకొండ నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా కూడేరు మండల పరిధిలోని లెప్రసీ కాలనీ సమీపాన టైర్ పంక్చరవడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. గాయపడిన నాగచైతన్యను మరొక ద్విచక్రవాహనంపై అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

పండ్ల మొక్కల సాగుకు దరఖాస్తు చేసుకోండి

కుందుర్పి: డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మెట్టభూముల్లో పండ్ల తోటల సాగుకు ఆసక్తి గల రైతులు ఈనెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ ఓబిరెడ్డి, ఉపాధిహామీ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శర్మాస్‌వలి తదితరులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5 ఎకరాల్లోపు భూములు ఉన్న చిన్న, సన్నకారు రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులని వెల్లడించారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 300 మంది రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఆసక్తి గలవారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి


కనుకూరులో మలాథియాన్ పిచికారీ చేస్తున్న దృశ్యం

శెట్టూరు: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని సర్పంచ్ కావేరి, పంచాయతీ కార్యదర్శి బొమ్మ శంకర్ సూచించారు. బుధవారం కనుకూరు గ్రామంలోని వీధుల్లో దోమల నివారణకు మలాథియాన్ పిచికారీ చేశారు. బురద గుంతలు, నీటి కుంటలు, చెత్తతో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమకాటుతో డెంగ్యూ, మలేరియా జ్వరాలు సోకుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సెంచరీ దాటిన టమాట


మార్కెట్‌కు తరలించేందుకు టమాటాను సిద్ధం చేస్తున్న దృశ్యం


ఉల్లిగడ్డలను ప్యాకెట్లలో నింపుతున్న కూలీలు

- కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి
- పెరిగిన ధరలతో ఉక్కిరిబిక్కిరవుతున్న వినియోగదారులు

రాయదుర్గం: మార్కెట్లో టమాట ధరలు ఠారెత్తిస్తున్నాయి. తానేమి తక్కువ కాదనట్టు ఉల్లి కూడా కన్నీరు పెట్టిస్తోంది. వంటింట్లో అతి ముఖ్యమైన ఈ రెండు వస్తువులు సామాన్యులకు చుక్కలు చూపుతున్నాయి. కూరగాయల ధరలకు ఇప్పటికే రెక్కలు రావడంతో ఏం కొనాలో.. ఏం తినాలో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

టమాట ధర సెంచరీ దాటింది. వారం క్రితం మార్కెట్లో కిలో టమాట రూ.40 నుంచి రూ.50 పలికితే బుధవారం రూ.100 నుంచి రూ.110కి ఎగబాకింది. ఉల్లి కూడా అదే బాట పట్టింది. ఇప్పటి దాక రూ.40 నుంచి రూ.60 పలికిన ధర తాజాగా రూ.80 కి పెరిగింది. మిగతా కూరగాయలు ఏవి కొనాలన్నా కిలో రూ.40 పైమాటే. వాతావరణ పరిస్థితుల కారణంగా కూరగాయల దిగుబడి కాస్త తగ్గి ధరలు మోతమోగిస్తున్నాయి. రాయదుర్గం పరిసరాలతో పాటు పక్కనే ఆనుకుని ఉండే కర్ణాటక రాష్ట్రంలోనూ రైతులు విస్తారంగా కూరగాయల పంట పండిచేవారు. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక సరుకు కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ భారం వినియోగదారులపై పడుతోంది.

రాయితీపై అందించాలి

టమాట, ఉల్లి ధరలు దడ పుటిస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లలో రాయితీ పై అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఉత్పత్తి ఉన్న చోట కొనుగోలు చేసి ప్రజా అవసరాల మేరకు పౌరసరఫరాల ఆధ్వర్యంలో టమాట, ఉల్లితో పాటు ఇతర కూరగాయాలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కెట్లోకి రూ. వెయ్యి తీసుకెళ్లినా హ్యాండ్ కవర్ నిండని పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని ధరలూ పెరిగాయి

మార్కెట్‌కు వెళ్లాలంటనే భయమేస్తోంది. అన్ని ధరలు పెరిగిపోయాయి. కొత్తిమీర కూడా కొనే పరిస్థితి లేదు. చివరకు చికెన్, మటన్, కోడిగుడ్లు ధరలు కూడా రెట్టింపయ్యాయి. ధరలు అదుపులో ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– రూప, గృహిణి, చర్చి ఏరియా, రాయదుర్గం

రాయితీపై అందించాలి

ధరల అదుపుకు కృషి చేయాలి. టమాట, ఉల్లిని రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై రైతు బజార్లలో పంపిణీ చేయాలి. మార్కెట్లో ఓ ధరతో కొనుగోలు చేసి వాటినే వీధుల్లో ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. ఇది సామాన్యులకు ఇబ్బంది కరంగా మారుతోంది. రాయితీపై అందించి అమ్మితే బాగుంటుంది.

– పూజ, కుమ్మరవీధి, రాయదుర్గం

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


వజ్రకరూరులో మలేరియా వ్యతిరేక మాసోత్సవపై ర్యాలీ


కొనకొండ్లలో అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ

వజ్రకరూరు: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా, వైద్యాధికారి సర్దార్‌వలి తదితరులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పురవీధులగుండా ర్యాలీ సాగింది. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సర్పంచ్, వైద్యాధికారి మాట్లాడుతూ వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలని సూచించారు. దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే దోమలను నివారించవచ్చని అన్నారు. నెలాఖరు వరకు అన్ని గ్రామాల్లోనూ జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం కొనకొండ్లలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో దోమల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహనకల్పించారు. అలాగే రాగులపాడులోని గురుకుల పాఠశాలలో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలోహెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, ప్రిన్సిపాల్ జోనాథన్, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్లు నాగశంకర్, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

లత్తవరంలో ఘనంగా ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి


ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘం నేతలు

ఉరవకొండ: లత్తవరంలో ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 15వ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. దళిత, గిరిజన హక్కుల సాధన సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మీనుగ గోపాల్ ఆధ్వర్యంలో దళిత, గిరిజనులు ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మీనుగ గోపాల్ మాట్లాడుతూ ఫాదర్ ఫెర్రర్ కరువు పీడిత ఉమ్మడి అనంతపురం జిల్లాలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆర్డీటీని ప్రారంభించారన్నారు. దళిత, గిరిజనులకు ఉచితంగా విద్య, వైద్యం అందించడానికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం అదే స్ఫూర్తితో ఆయన తనయుడు మాంఛో ఫెర్రర్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీజీహెచ్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్, సోమశేఖర్, రమేష్, భారతి, భాస్కర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

పెద్దపప్పూరు: మండలంలోని జూటూరు రైల్వే బ్రిడ్జి వద్ద ఇసుక టిప్పర్‌ను ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గౌస్‌బాషా పట్టుకున్నారు. యాడికి మండలం రాయలచెరువు వాసి వేణుగోపాల్ నాయుడుకు చెందిన టిప్పర్ ఇసుక లోడుతో తాడిపత్రి వైపు నుంచి పెద్దపప్పూరు వైపు వస్తుండగా జూటూరు వద్ద పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్‌ను సీజ్ చేసి డ్రైవర్ లోకేష్, వాహనయజమానిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశువైద్యాధికారులు

బొమ్మనహాళ్: పశువులకు సంబంధించి వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుగణాభివృద్ధి అధికారి డాక్టర్ టీవీ సుధాకర్ అన్నారు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో బుధవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఉచిత వైద్య శిబిరంలో 105 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. 49 పశువులకు గర్భకోశ వ్యాధికి చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్త పశువులకు, లేగదూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ టీవీ సుధాకర్ మాట్లాడుతూ పాడి రైతులు సరైన సమయంలో పశువుల ఎద లక్షణాలు గుర్తించి పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర ద్వారా చికిత్స చేయించుకోవాలన్నారు. గొడ్డు మోతు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పశువులకు సరైన పోషణకు పచ్చి మేత దాణాతో పాటు కొండ చిరిరాకు, మునగాకు, కరివేపాకు, మొలకెత్తిన సెనలు, ఉలవలు, సద్దలు, రాగులతో మేపితే హార్మోన్స్ లోపం , పోషకార లోపాలు లేకుండా పశువులకు త్వరగా చూలు కట్టించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి బి.వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర సిబ్బంది పాల్గొన్నారు.

దివ్య ఔషధం 'అల్ల నేరేడు'

- ఆరోగ్య ఫల ప్రదాయినిగా గుర్తింపు
- సీ విటమిన్ పుష్కలంగా లభించే సీజనల్ ఫ్రూట్
- కిలో రూ.80 నుంచి రూ.150 వరకూ పలుకుతున్న ధరలు


నేరేడు పండ్లను గ్రేడింగ్ చేసిన దృశ్యం


చాపిరి వద్ద అల్ల నేరేడు పండ్లను వేరు చేస్తున్న వ్యాపారి

కళ్యాణదుర్గం: మధుమేహ వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధంగా అల్ల నేరేడు ఉపయోగపడుతుంది. ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతుల్లో ఒక్కటైన, ఆరోగ్య ఫల ప్రదాయినిగా పిలిచే అల్లనేరేడు ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు శరీరంలో ఉండే అనారోగ్య సమస్యలు, రుగ్మతలను దూరం చేస్తుంది. నేరేడు పండు మాత్రమే కాకుండా ఆకులు, చెట్టు బెరడు, గింజలు కూడా శరీరానికి మేలు చేస్తాయి. అల్ల నేరేడు పండులో అత్యధిక పోషకాలు ఉన్న నేపథ్యంలో పండు రూపంలోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీంల తయారీలో పెద్ద ఎత్తున వాడుతున్నారు. అలాగే నేరేడు కాయలను వెనిగర్, వైన్ తయారీలో ప్రముఖంగా వినియోగిస్తున్నారు.

మంచి గిరాకీ..

ప్రస్తుతం అల్ల నేరేడు పండ్ల సీజన్. దీంతో ఎక్కడ చూసినా పండ్ల దుకాణాలు, తోపుడు బండ్లలో విరివిగా అల్ల నేరేడు పండ్లను వ్యాపారులు విక్రయిస్తున్నారు. కిలో అల్ల నేరేడు ప్రస్తుతం మార్కెట్లో నాణ్యతను బట్టి రూ.80 నుంచి రూ.150 వరకు ధరలు పలుకుతున్నాయి. అందులో మరింత నాణ్యమైన నేరేడు పండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తున్నారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానపరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ప్రస్తుతం సీజన్లో రోజుకు రెండు చొప్పున నేరేడు పండ్లు తింటే వ్యాధులు దరిచేరవని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రయోజనాలు ఇలా..

- నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధులు దరిచేరవు.
- మూత్ర సమస్యల నియంత్రణలో ఉపయోగపడుతుంది.
- ఆకలిని పెంచే గుణంతో పాటు శరీరంలోని పైత్యాన్ని తగ్గిస్తుంది.
- అల్లనేరేడు చెక్క నుంచి తీసిన కషాయం అతిసార, నీళ్ల విరోచనాలు, జ్వరాన్ని తగ్గిస్తుంది.
- విత్తనాలను ఎండబెట్టి చూర్ణం చేసి తీసుకుంటే మధుమేహం కంట్రోల్ అవుతుంది.
- కిడ్నీలను శుభ్రపరచడంతో పాటు మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది.
- కాలేయం పనితీరును మెరుగు పరచడంతో పాటు శుభ్ర పరుస్తుంది.
- దంతాలు, చిగుళ్ల ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్లలో రక్తస్రావం తగ్గుతుంది. నోట్లో చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా నివారిస్తుంది.

అధికంగా తింటే అనర్థాలు

- నేరేడు పండ్లు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు చోటుచేసుకుంటాయి. వగరు రుచి కలిగిన నాణ్యత లేని పండ్లను భుజిస్తే గొంతు నొప్పి సంభవిస్తుంది.
- సీజన్ మారే సమయంలో వచ్చే అల్ల నేరేడు పండ్లను మితంగా తినాలి.
- ఉబ్బసం ఉన్న వారు ఈ పండ్లను మితంగా తినాలి. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.
- నేరేడు పండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి వచ్చే అవకాశం ఉంటుంది.

ఆరోగ్యానికి మేలు



అల్ల నేరేడు పండ్లు ఆరోగ్యానికి దివ్య ఔషధంగా పని చేస్తాయి. శరీరంలోని అనేక రుగ్మతలను నివారిస్తాయి. ఐరన్, క్యాల్షియం, పొటాషియం ఎక్కువగా ఉంటుంది. సీ విటమిన్ నేరేడు ద్వారా శరీరానికి అధికంగా లభిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతగానో మేలు చేస్తుంది. మితంగా తినాలి. అతిగా తింటే జలుబు, దగ్గుతో పాటు శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

- వేణు కార్తికేయ, మెడికల్ ఆఫీసర్, శెట్టూరు

ఉపాధిలో అవకతవకలపై చర్యలకు సిఫారసు


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ వెంకటరత్నం

యల్లనూరు: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలకు సిఫారసు చేస్తామని తాడిపత్రి క్లస్టర్ ఏపీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. 'ఉపాధిలో వింతలు' శీర్షికన బుధవారం సాక్షి పత్రికలో వెలువడిన కథనానికి తాడిపత్రి క్లస్టర్ ఏపీడీ వెంకటరత్నం స్పందించారు. యల్లనూరు ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, టెక్నికల్ అసిస్టెంట్లు శంకర్, జయరాం, శ్రీనివాసులు, ప్రతాప్, అదిల్‌లతో బుధవారం తాడిపత్రి ఏపీడీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ సాక్షి కథనంపై వార్తపై చర్చించారు. అవకతవకలపై విచారించి బాధ్యులపై పీడీ స్థాయి అధికారులకు నివేదికలను పంపుతామని హెచ్చరించారు. పాత గుంతలకు కొత్త ఐడీలు క్రియేట్ చేసి జేబులు నింపుకోవడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం అన్ని గ్రామాల్లో జలధూత్ సర్వే చేయాలన్నారు. నూతనంగా 300 ఎకరాలు డ్రైల్యాండ్ హార్టికల్చర్ మంజూరైందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉపాధి కూలీల హాజరును పెంచేందుకు కృషి చేయాలన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

గుత్తి: మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో మంగళవారం రాత్రి ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. బైక్‌లో వెళ్లే వారిపై దాడి చేసి కరిచింది. పిచ్చికుక్క దాడిలో గంగాధర్, శీనా అనే వ్యక్తులతో పాటు మరో వ్యక్తిపై దాడి చేసి కరిచింది. బాధితులను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల కుక్కల దాడి అధికమైందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

కారు ఢీకొని పెయింటర్‌కు తీవ్రగాయాలు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యానగర్‌కు చెందిన పెయింటర్ ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు జిల్లా చిప్పగిరిలో ఇంటి పెయింటింగ్ పనులు పూర్తి చేసుకుని తిరిగి గుంతకల్లుకు తన బైక్‌పై వస్తున్న ఆంజనేయులును ఆలూరు వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఆంజనేయులు కుడి కాలు విరిగిపోయింది. దీంతో స్థానికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆలూరు రోడ్డు ఎన్టీఆర్ విగ్రహం వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని ఆ వార్డు కౌన్సిలర్ సుమోబాషా అధికారులను కోరారు.

మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి


మహంతపురం సమీపంలో సాగు చేసిన మొక్కజొన్న

కుందుర్పి: ఖరీఫ్ సీజన్లో భాగంగా రైతులు బోరుబావుల కింద సుమారు 1000 ఎకరాల్లో మొక్కజొన్న, 640 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసినట్లు వ్యవసాయ అధికారి మహేష్ తెలిపారు. మార్కెట్లలో క్వింటా మొక్కజొన్న రూ.2,350 ధర పలుకుతుండటంతో రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్బీకేల్లో మొక్కజొన్న విత్తనాలు, అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు సమీపంలోని కర్ణాటక ఎరువుల దుకాణాల్లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నట్లు బెస్తరపల్లి రైతులు శివశంకర్, రామాంజనేయులు, తిప్పేస్వామి, రామదాసు తదితరులు పేర్కొన్నారు. ఎరువుల విషయమై ఏఓ మహేష్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 16 ఆర్బీకేల్లో 12 టన్నుల డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

స్టేట్ బ్యాంక్ మేనేజర్‌గా సురేంద్ర కుమార్


సురేంద్ర కుమార్

కూడేరు: మండల కేంద్రం కూడేరులోని స్టేట్ బ్యాంక్ మేనేజర్‌గా సురేంద్ర కుమార్ నియమితులయ్యారు. బుధవారం ఆయన మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. బ్యాంక్ సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈయన అనంతపురం స్టేట్ బ్యాంక్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న నాగరాజు బదిలీపై ఆదోని వెళ్లారు. ఎక్కువ మందితో ఖాతాలు తెరిపించి, డిపాజిట్లు చేయించి బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన మేనేజర్ సురేంద్ర కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం బోల్తా

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి క్రాస్ వద్ద బుధవారం ద్విచక్ర వాహనం బోల్తా పడిన ఘటనలో లింగన్న అనే వ్యక్తి గాయాల పాలయ్యాడు. స్థానికుల వివరాల మేరకు .. బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తికి చెందిన మామ, అల్లుడు లింగన్న, చిక్కన్న ద్విచక్ర వాహనంపై రాయదుర్గంకు బయలుదేరారు. మార్గమధ్యంలోని గోనబావిక్రాస్ వద్ద వారి వాహనానికి కుక్క అడ్డంగా రావడంతో కింద పడ్డారు. లింగన్న గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కూలీల హాజరు శాతం పెంచాలి


సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

బెళుగుప్ప: ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు శాతం పెరిగేలా చూడాలని ఎంపీడీఓ సుబ్బరాజు సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి హామీ కింద చేపట్టే పనులపై ఏపీఓ సూర్యప్రకాశ్‌తో కలసి ఎంపీడీఓ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి పథకం కింద మండల వ్యాప్తంగా 250 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సాధారణ పనులకు అంచనాలు, పూర్తయిన పనులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శివారెడ్డి, జేఈ జయలక్ష్మి, టీఏలు నాగేంద్రప్ప, స్వాతి, అరవింద్, ఎఫ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పరిశీలన


ఎస్‌ఎస్ ట్యాంకులో నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కణేకల్లు: రాయదుర్గం పట్టణ ప్రజల దాహార్తి తీర్చే కణేకల్లు శివారులో ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకును బుధవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సందర్శించారు. రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ కిశోర్, డీఈఈ సురేష్ ఆయన వెంట ఉన్నారు. ఎన్ని రోజుల వరకు ఈ నీరు సరిపోతాయని ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.